డ్రగ్స్‌రహిత తెలంగాణ కోసం ప్రత్యేక శిక్షణ

యూసుఫ్‌గూడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు, ఐటీ కంపెనీల యాజమాన్యాలకు జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) కార్యాలయంలో ఈ నెల 26 నుంచి 29 వరకు శిక్షణ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించడానికి, రాష్ట్రాన్ని 'మాదకద్రవ్య రహిత తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ)ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా యువతను మదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు తదితర ఉన్నత విద్యాసంస్థలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థుల సంరక్షణకు చర్యలు తీసుకోనున్నారు. కాగా, ఇప్పటి వరకు 20,989 ఉన్నత పాఠశాలల్లో, 4,729 కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. 21,246 మంది సిబ్బందికి శిక్షణ ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. దీనికి కొనసాగింపుగా ఈ నెల 26 నుంచి 2 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాబోయే ఆరు నెలల్లో 1.30 లక్షల మంది ఎన్ఎస్ఎస్ సభ్యులకు, 70 వేల మంది ఎన్‌సీసీ సభ్యులకు శిక్షణ ఇవ్వడం ద్వారా 2లక్షల మంది యాంటీ డ్రగ్ సోల్జర్స్‌ను తయారు చేయనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

గంజాయి అమ్ముతున్న, కొనుగోలు చేస్తున్న వారి అరెస్ట్

బంజారాహిల్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి నగరానికి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు మరో ఏడుగురు వినియోగదారులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14 నందినగర్‌లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడిచేశాడు. సంతోష్ రౌత్ అనే వ్యక్తి ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.700-800 చొప్పున అమ్మకాలు చేస్తున్నట్టు తేలింది. ప్రధాన నిందితుడు సంతోష్‌తోపాటు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన కోటకొండ బన్నీ, పులిచింతల నరేష్, కాత్రావత్ గణేష్, జహీర్, అఖిల్, యూసుఫ్, షాబాజ్‌ఖాన్‌లను అరెస్టు చేశారు.

కుమారుడిని కిడ్నాప్ చేశామని రూ.90 వేలు కాజేశారు

బంజారాహిల్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుమారుడు కిడ్నాప్ అయ్యాడని వచ్చిన ఓ నకిలీ ఫోన్ కాల్‌కు భయపడిన తల్లి తన సోదరి చేత రూ.90 వేలను సైబర్ నేరగాళ్లకు ట్రాన్స్‌ఫర్ చేయించింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లో నివసించే పూజా రౌతేలా మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తుంది. ఈ నెల 25న జార్ఖండ్‌లో ఉండే ఆమె సోదరి మీనాక్షి చౌదరి ఫోన్ చేసి తన కుమారుడు కిడ్నాప్ అయినట్లు ఫోన్ వచ్చిందని ఓ ఫోన్ నంబర్ ఇచ్చి డబ్బు బదిలీ చేయాలని కోరింది. ఈ మేరకు పప్పు అనే వ్యక్తికి మూడు దఫాలుగా పూజా రౌతేలా 90 వేల రూపాయలు బదిలీ చేసింది. అయితే కాసేపటి తర్వాత మీనాక్షి ఫోన్ చేసి తనకు వచ్చింది ఫేక్ కాల్ అని, తన కుమారుడు ఇంటికి వచ్చాడని చెప్పింది. మోసపోయినట్టు గ్రహించిన పూజ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

30, 1న భగవద్గీతపై ప్రసంగాలు

ఖైరతాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక గురువు స్వామి సుఖబోధానంద నవంబరు 30, డిసెంబరు 1 తేదీల్లో భగవద్గీత గురించి ప్రసంగిస్తారని ప్రసన్న ట్రస్టు ఓ ప్రకటనలో తెలిపింది. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు మార్గదర్శనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా..!

- శ్రీనగర్‌కాలనీ అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు
- డిసెంబరు 8న కలశాభిషేకం, 15న గజారోహణం వేడుకలు

బంజారాహిల్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శబరిమల తరహాలో పూజలు నిర్వహిస్తూ భక్తుల్లో ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయం 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ప్రతి మండల కాలంలో నిత్యం విశేష పూజలతో పాటు అష్టకలశాభిషేకం, లక్ష పుష్పార్చన, గజారోహణం వంటి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ గణపతి హోమం, అభిషేకం, సాయంత్రం పడిపూజ కార్యక్రమాలు చేస్తున్నారు. ఆలయానికి వచ్చే మాలధారులతో పాటు సాధారణ భక్తులకు ఇక్కడ నిత్యం అన్నదానం, సాయంత్రం అల్పాహారం అందిస్తుంటారు. 1999లో సుమారు 30మందితో మొదలైన అన్నదానం ప్రస్తుతం దాదాపు వెయ్యి మందికి చేస్తున్నారు.

డిసెంబరు 8న కలశపూజ

తెలుగు, కేరళ సంప్రదాయాలను అనుసరించి ఇక్కడ పూజాదికాలు జరుగుతుంటాయి. మండల దీక్షలు మొదలైన 20 రోజులకు అష్టకలశాభిషేకం నిర్వహిస్తారు. ఈ క్రమంలో డిసెంబరు 8న ఉదయం నుంచి 108 కలశాలకు వేద మంత్రాల మధ్య పూజలు నిర్వహించిన అనంతరం దీక్షపరులు తలమీద కళశాలు పెట్టుకొని ప్రదక్షిణలు చేసి ఆ నీటితో అయ్యప్ప మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు. కేరళ వాయిద్యాల మధ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. మండల పూజ ముగిసే ముందు అయ్యప్పకు లక్ష పుష్పాలతో పూజలు చేస్తారు.

కన్నులపండువగా గజారోహణం

ఇక్కడ ప్రతి ఏడాది అయ్యప్ప గజారోహణంను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు 15న ఈ ఉత్సవం జరగనుంది. దీని కోసం శబరిమల నుంచి అర్చకులు వస్తారు. కేరళ సంప్రదాయ నృత్యాలు, విన్యాసాల మధ్య అయ్యప్ప గజారోహణం చేస్తారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ఏనుగు అంబారీపై శ్రీనగర్‌కాలనీ, ఇందిరానగర్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎల్లారెడ్డిగూడ మీదుగా ఊరేగింపు నిర్వహిస్తారు.



అష్టకలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు(ఫైల్)

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

మండల పూజల కోసం వస్తున్న భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మిగతా ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నాం. ఆలయ ప్రతిష్ఠను పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాస్ శర్మ, ఆలయ ఈఓ

సంప్రదాయబద్ధంగా పూజలు

మండల కాలంలో ప్రత్యేక పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నాం. ఆధ్యాత్మిక భావనకు పెద్దపీట వేస్తూ అయ్యప్ప భజనలు, పడిపూజలు చేస్తున్నాం. గజారోహణం వేడుకలకు సుమారు 15 వేల మంది భక్తులు హాజరవుతారు. భక్తులకు నిత్యం రుచికరమైన ఆహారం అందిస్తున్నాం.

- శ్రీనివాస్‌శర్మ, ఆలయ అర్చకులు, గురుస్వామి



నాటకంలోని ఓ సన్నివేశం

ఆలోచింపజేసిన స్వేచ్ఛ నాటకం

రవీంద్రభారతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనసుకు నచ్చినట్లు, ఇష్టం వచ్చినట్లు విచ్చలవిడిగా ఏదిపడితే అది చేయడం కాదు, స్వేచ్ఛ అంటే యథేచ్ఛ కాదు అనే ఇతివృత్తంగా సాగిన స్వేచ్ఛ నాటకం ఆలోచింపజేసింది. బుధవారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో స్వేచ్ఛ నాటకాన్ని ప్రదర్శించారు. విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ సమర్పించిన ఈ నాటకానికి మూల కథ పి.ఎస్.నారాయణ, నాటకీకరణ పరమాత్ముడి శివరాం, దర్శకత్వం బి.ఎం.రెడ్డి అందజేశారు. స్వేచ్ఛ ఎలా ఉండాలి ఎంత వరకు ఉండాలి అనే సారాంశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ రమణాచారి నటీనటులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన కాసేపు టికెట్ విక్రయ కేంద్రం వద్ద కూర్చున్నారు. ఇంతలో సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ వచ్చి టికెట్ కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని కళాకారులను సత్కరించారు.

వికసిత్ భారత్ కోసం 'విజన్ ఆఫ్ 2047'

- ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి.రాజ్
- 70వ జాతీయ సమావేశాల్లో పలు తీర్మానాలు చేసినట్లు వెల్లడి

పంజాగుట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోరఖ్‌పూర్‌లోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 70వ జాతీయ సమావేశాల్లో పలు తీర్మానాలు చేసినట్లు పరిషత్ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి.రాజ్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పరిషత్ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పృథ్వీ, కల్యాణిలతో కలిసి ఆయన మాట్లాడారు. రికార్డ్ స్థాయిలో 55.12 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందన్నారు. నాణ్యమైన విద్య, ఫీజుల పెంపు, ఆహార కల్తీ, అంతర్జాతీయ వేదికలపై భారత్ దౌత్యం, మణిపూర్‌లో హింసను ఖండిస్తూ పరిషత్ 70వ జాతీయ సమావేశాల్లో తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించినట్లు తెలిపారు. వికసిత్ భారత్ కోసం విజన్ ఆఫ్ 2047 గురించి అనేక వినూత్నమైన కాన్సెప్ట్‌లను విద్యార్థుల ముందు ఉంచామని, యువత ఆలోచనలపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి.రాజ్

'యూత్ డే' పోస్టర్ ఆవిష్కరణ

బోరబండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా నిర్వహించే తెలంగాణ యూత్ డేను జయప్రదం చేయాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సూచించారు. బుధవారం సైట్-2 కార్యాలయంలో శ్రీకాంతాచారి వర్ధంతి గోడ పత్రికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగ యువత కోసం ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నారన్నారు. డిసెంబరు 3న యూత్ డేను యువత జరుపుకోవాలని ఆయన కోరారు.



యూత్ డే పోస్టర్‌లను విడుదల చేస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ తదితరులు



అన్నదానం

శ్రీనగర్‌కాలనీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులు పడిపూజలో పాల్గొని అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు.

- బంజారాహిల్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)

బాధితుల ఖాతాల్లోకి సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు

- రెండు వేర్వేరు కేసుల్లో రూ.8.16 లక్షల రికవరీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బును హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు బాధితుల ఖాతాలో జమ చేయించారు. నగరానికి చెందిన మహిళ(52)కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, మనీ లాండరింగ్ కేసుల్లో తన బ్యాంకు ఖాతాలు వినియోగించారని, అరెస్ట్ తప్పదని బెదిరించారు. కేసుల నుంచి బయటపడాలంటే డబ్బు కట్టాలని భయపెట్టి ఆమె వద్ద నుంచి రూ.4,22,560 వసూలు చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో వెంటనే రంగంలోకి దిగిన సైబర్ క్రైం పోలీసులు సైబర్ నేరగాళ్ల ఖాతాను గుర్తించి ఫ్రీజ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు బాధితురాలి డబ్బు రూ.4.22,560 ఖాతాలో జమ చేయించారు.

మరో కేసులో..

పార్ట్‌టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన మహిళ (49)ను మోసం చేసిన సైబర్ నేరగాళ్లు ఆమె వద్ద నుంచి పలు దఫాలుగా రూ.7.65,110 వసూలు చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించగా.. సైబర్‌క్రైం అధికారులు మోసగాళ్ల బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేయించారు. కోర్టు ఆదేశాల మేరకు సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు నుంచి రూ.4,23,667లను బాధితురాలి ఖాతాలో జమ చేయించారు.

27 రోజులుగా మృత్యువుతో పోరాడి.. చిన్నారి మృతి



జస్మిత (ఫైల్)

కుషాయిగూడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దాదాపు నెల రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచర్లపల్లి వెంకటొరెడ్డినగర్‌లో ఉంటున్న సాయికుమార్ పార్కింగ్ ప్లేస్‌లోని తన కారులో క్యాన్‌లో తెచ్చిన పెట్రోల్‌ను పోస్తుండగా కిందపడింది. ఈ నెల 1న దీపావళి పండుగకు ఇంటి ముందు వెలిగించిన దీపాలకు పెట్రోల్ అంటుకొని మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇద్దరు బాలికలు తీవ్రంగా గాయపడ్డారు. ఓ బాలిక యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండురోజుల తర్వాత మృతిచెందింది. ఇంట్లో అద్దెకు ఉంటున్న రాంబాబు కుమార్తె జస్మిత(4) అప్పటి నుంచి నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన ఇంటి యజమానిని రిమాండ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ తెలిపారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

- వ్యాపారవేత్త వెంకటేశ్వరరావు

పంజాగుట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్ మాజీ కార్యదర్శి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని నగరానికి చెందిన వ్యాపారవేత్త, వీఎస్వీ ఇమేజింగ్ సిస్టమ్స్ అధినేత వెంకటేశ్వరరావు ముప్ప ఆరోపించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన 35 సంవత్సరాలుగా ప్రింటింగ్ ఇండస్ట్రీలో వ్యాపారం నిర్వహిస్తున్నానని, కరోనా సమయంలో వ్యాపార ఒడిదుడుకులతో పాటు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న తన వద్దకు వచ్చిన అతడు తనను వ్యాపార భాగస్వామిగా చేసుకున్నాడన్నారు. అయితే అతడు అక్రమాలకు పాల్పడుతుండటంతో దూరంగా ఉంటున్నానని.. అయితే ఇప్పటికీ తన పేరును ఉపయోగించుకుంటూ వ్యాపారాలు చేయడమే కాక సెటిల్మెంట్లకు రావాలంటూ ఒత్తిడి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ నెల 13న రెడ్‌హిల్స్‌లోని తన కార్యాలయానికి రౌడీలతో వచ్చి దాడి చేశారని, దానికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీతో నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. అతడి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నందున తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులను వెంకటేశ్వరరావు వేడుకున్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు



అనారోగ్యంతో బాధపడుతున్న అంబేద్కర్‌నగర్‌కు చెందిన పడిదల విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని అందజేస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.

- బంజారాహిల్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)

రాజ్‌భవన్‌ను పాత నగరానికి తరలించాలి



చార్మినార్ వద్ద టీడీపీ సభ్యత్వ నమోదులో అరవింద్ కుమార్‌గౌడ్ తదితరులు

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్‌గౌడ్

చార్మినార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాతనగరానికి గవర్నర్ నివాసం రాజభవన్‌ను తరలించి సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీ బలం పుంజుకొని అధికారాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యత్వ నమోదును బుధవారం ఆయన చార్మినార్ వద్ద ప్రారంభించారు. తొలుత భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. పాతనగరం అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసిందని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పాతనగర అభివృద్ధిని విస్మరించాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం పాతనగరంలో వైద్య కళాశాల ఏర్పాటు చేసి ప్రజల కోసం వెయ్యి పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని, సర్దార్ మహల్లో చార్మినార్ ఆయుర్వేద ఆస్పత్రిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం ఫోర్‌మన్ కమిటీ కో-ఆర్డినేటర్ నాగు నాగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి పి.సాయిబాబా, మాజీ కార్పొరేటర్ శంకర్ ముదిరాజ్, సమన్వయ కమిటీ ప్రతినిధులు సురేందర్, ఎండీ అన్వర్ పాల్గొన్నారు.

పుస్తకంలో కదిలే అక్షరాల మాలిక

- తొలిసారిగా ఈ విధానంలో తెలుగు అక్షరాల రూపకల్పన

ఎర్రగడ్డ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఖ్యాతిని నలుదిశలా చాటడానికి కొందరు కళాకారులు ప్రయత్నిస్తుంటే, మరికొందరు ప్రయోగాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వారిలో టైపోవనం వ్యవస్థాపకులు శశి గూడూరు ఒకరు. వినూత్నంగా అచ్చులు, హల్లులతో కూడిన పుస్తకాన్ని ఆయన రూపొందించారు. పుస్తకం తెరవగానే అక్షరాలు త్రీడీ రూపంలో పాప్ అప్ అయ్యేలా తయారు చేశారు. అమ్మ భాషపై మక్కువతో చిత్ర లిపికి అచ్చులతో కూడిన అక్షరాకృతుల ప్రయోగాత్మక పుస్తకాన్ని రూపొందించారు. తన ఆర్కిటెక్ట్ నైపుణ్యంతో ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా పుస్తకంలో కదిలే తెలుగు అక్షరాలను తీర్చిదిద్దారు.

అక్షరాలను పిల్లలకు చేరువ చేసేందుకు..

తెలుగు అక్షరాలను పిల్లలకు చేరువ చేయడానికి ఆయన వినూత్న ప్రయోగం చేశారు. పుస్తకం తెరవగానే అక్షరాలు కదిలేలా రూపొందించి అద్భుతాన్ని సృష్టించారు. వాటిని చూసి పిల్లలే కాకుండా అన్ని వయసుల వారు మురిసిపోతున్నారు. ప్రతి పేజీని తిరగేస్తున్నప్పుడు అక్షరాలు జీవం పోసుకున్నట్లు ఉంటుంది. ఈ పుస్తకాన్ని పాప్‌అప్ స్టైల్‌లో రూపొందించారు. పాప్-అప్‌లతో నిండిన పేజీలను అన్వేషించేటప్పుడు గొప్ప అనుభూతి కలుగుతుంది. కాగా, శశి గూడూరు విజువల్ కమ్యూనికేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్. హైదరాబాద్ జూ టి సార్, టీవీ టి యాప్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వంటి బ్రాండింగ్ ప్రాజెక్ట్‌లలో పనిచేశారు.



కళాక్షరిక పుస్తకంలోని ఓ పేజీ

ప్రయోగాలు చేయడం ఇష్టం



ప్రయోగాలు చేయడం అంటే చాలా ఇష్టం. ఆన్‌లైన్‌లో ఒక త్రీడీ కార్డు చూశాను. అందులో గుర్రం బొమ్మ ముందుకు దూసుకొస్తున్నట్లు ఉంది. అప్పుడే ఈ కళాక్షరిక పుస్తకాన్ని తయారు చేయాలన్న ఆలోచన వచ్చింది. ఇంగ్లిషులో ఇలాంటి ప్రయోగాలు చేశారు. అందుకే తెలుగులోనూ తయారు చేయాలన్న సంకల్పంతో ఈ పుస్తకాన్ని రూపొందించా. తెలుగు అక్షరాలు చిన్న పిల్లలతో పాటు అన్ని వయసుల వారి మనసులోనూ చెరగని ముద్ర వేయాలన్న కోరికతోనే పాప్‌అప్ పుస్తకాన్ని రూపొందించా.

- శశి గూడూరు, టైపోవనం వ్యవస్థాపకుడు

సంధ్య కన్‌స్ట్రక్షన్‌పై కేసు నమోదు

రాయదుర్గం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భగీరథమ్మ చెరువులో మట్టిపోసిన సంధ్య కన్‌స్ట్రక్షన్‌పై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. చెరువుల్లో మట్టిపోయకుండా హైడ్రా గత కొంతకాలంగా నిఘా పెట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం టిప్పర్లతో భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణ వ్యర్థాలు, మట్టి పోస్తుండగా హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలు గుర్తించాయి. ఇరిగేషన్‌శాఖ అధికారులకు హైడ్రా తనిఖీ బృందాలు సమాచారమివ్వడంతో రాయదుర్గం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో జేబీసీ యజమాని సురేష్, సంధ్య కన్‌స్ట్రక్షన్ యజమాని శ్రీధర్‌రావుతో పాటు వెంకటేశ్వరరావు, సుంకర వీర వెంకట సత్యనారాయణ మూర్తి, మణికంఠలపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

మర్యాదపూర్వక సమావేశం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా తలసానిని ఆయన శాలువాతో సత్కరించారు.

ఆసరా పెన్షన్ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది



అశోక్ కుమార్, తిరుమలగిరి మండల తహసీల్దార్

తిరుమలగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆసరా పెన్షన్‌లను సకాలంలో అందజేస్తున్నామని తిరుమలగిరి మండల తహసీల్దార్ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

మండలం పరిధిలో ఆసరా పింఛన్లు ఎన్ని ఉన్నాయి?

వృద్ధాప్య పింఛన్లు 3575, వితంతు 4343, వికలాంగులు 1261, ఒంటరి మహిళ 507 ఉన్నాయి. సకాలంలో పెన్షన్‌లు అందజేస్తున్నాం.

కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా వెరిఫికేషన్ చేస్తున్నారా?

2019 నుంచి ఆసరా పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తున్నాం.

ఇంటింటికీ వెళుతున్నారా?

అవును. ఇంటింటికీ వెలుతున్నాం. అర్హులైన లబ్ధిదారుల ఆధార్‌కార్డు, రేషన్ కార్డు ఇతర ధ్రువపత్రాలను సేకరిస్తున్నాం.

ఎన్ని వందలు పెండింగ్‌లో ఉన్నాయి?

సుమారు 500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వెరిఫికేషన్‌కు వస్తున్నాం అంటూ వారందరికీ సమాచారం అందిస్తున్నాం.

కొత్త వారికి డబ్బులు ఎప్పుడు రిలీజ్ చేస్తారు?

ప్రస్తుతానికి ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుంది. పెన్షన్‌లు మంజూరు చేసే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన జరుగుతున్నదా?

మంగళవారం కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన కోసం ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. దరఖాస్తుదారులు విద్యుత్ జీరోబిల్లు రాకున్నా గ్యాస్‌సబ్సిడీ రాకున్నా కార్యాలయంలో తిరిగి దరఖాస్తులను అప్‌లోడ్ చేసుకోవచ్చు. సెంటర్‌కు వచ్చే క్రమంలో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, గ్యాస్‌బిల్లు, విద్యుత్‌బిల్లు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదు వెంట తీసుకుని రావాలి.

ఈ ఇంటర్వ్యూ



బాల్య వివాహాలను నిరోధించేందుకు అవగాహన పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

బాల్య వివాహాలు లేని జిల్లాగా హైదరాబాద్‌ను మార్చుదాం : ఆర్డీఓ

హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ప్రచారం చేయడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం ద్వారా హైదరాబాద్ జిల్లాను బాల్యవివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు అందరూ కలిసి పనిచేయాలని సికింద్రాబాద్ ఆర్‌డీఓ సాయిరాం అన్నారు. సికింద్రాబాద్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెంటర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పోస్టర్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ బాల్య వివాహాలను ఆపేందుకు అన్ని శాఖలు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్‌తోపాటు పోలీసు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భగీరథమ్మ చెరువులో మట్టి డంపింగ్..

సంధ్య కన్‌స్ట్రక్షన్‌పై కేసు

రాయదుర్గం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భగీరథమ్మ చెరువులో మట్టిపోసిన సంధ్య కన్‌స్ట్రక్షన్‌పై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. చెరువుల్లో మట్టిపోయకుండా హైడ్రా గత కొంతకాలంగా నిఘా పెట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 3 గంటల సమయంలో టిప్పర్లతో భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణ వ్యర్థాలు, మట్టిని పోస్తుండగా హైడ్రాకు చెందిన డీఆర్‌ఎఫ్ బృందాలు గుర్తించాయి. ఈ విషయంపై ఇరిగేషన్‌శాఖ అధికారులకు హైడ్రా తనిఖీ బృందాలు సమాచారమివ్వడంతో ఇరిగేషన్ ఏఈ రాయదుర్గం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు జేసీబీ (నం.27సి3482)తో మట్టిని చదును చేస్తుండగా గుర్తించి, జేబీసీ యజమాని దున్నపోతు సురేష్, జేసీబీతో మట్టిని తరలించిన సంధ్య కనస్ట్రక్షన్ యజమాని శ్రీధర్‌రావుతో పాటు వెంకటేశ్వర రావు, సుంకర వీర వెంకట సత్యనారాయణ మూర్తి, మణికంఠలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



స్వెటర్‌ల అమ్మకాలు

పెరిగిన చలితీవ్రత.. స్వెటర్ల అమ్మకాల జోరు

రెజిమెంటల్‌బజార్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చలితీవ్రత పెరగడంతో చలి నుంచి ఉపశమనం పొందడానికి ధరించే దుస్తుల విక్రయాలు జోరందుకున్నాయి. కొన్ని కుటుంబాలు సీజనల్ వ్యాపారంగా నాలుగు నెలల పాటు విక్రయిస్తుంటారు. నవంబరులో ప్రారంభమై ఫిబ్రవరి వరకు కొనసాగుతాయి. స్వెటర్ల అమ్మకాలలో ప్రధానంగా కనిపించే నెపాలీలు ప్రస్తుతం కనిపించడం లేదు. కొవిడ్ నుంచి నేపాలీలు రావడం లేదని స్థానిక వ్యాపారులు తెలిపారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో పాలికాబజార్ చౌరస్తాలో సాయంత్రం వేళల్లో కస్టమర్లతో రద్దీగా మారుతున్నాయి. స్వెటర్‌లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్‌లు,జాకెట్లు, గ్లోవ్స్‌ను విక్రయిస్తున్నారు. వులెన్‌తో తయారుచేసిన రూ. 200-800, కాటన్‌వి అయితే రూ.300 -450, జాకెట్లు రూ.400-3000, చిన్న పిల్లల పోలో లాంటివి రూ.150 -200 విక్రయిస్తున్నారు. ఢిల్లీతో పాటు లోకల్‌గా స్వెటర్లను అమ్ముతున్నట్లు వ్యాపారులు తెలిపారు.



స్వెటర్లను కొనుగోలు చేస్తున్న మహిళలు

రేపు 4,250 బైక్‌లతో దీక్షాదివస్ వరకు ర్యాలీ

● సనత్‌నగర్, సికింద్రాబాద్ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి ● ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, తలసాని



కార్పొరేటర్లు, ముఖ్యనాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించే దీక్షాదివస్‌ను విజయవంతం చేయడానికి బీఆర్‌ఎస్ శ్రేణులు సమాయత్తం అవుతున్నాయి. 4,250 బైక్‌లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి 1250 బైక్‌లతో..

బౌద్ధనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భవన్‌లో ఈనెల 29న దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులకు సూచించారు. బుధవారం సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో దీక్షాదివస్‌కు ప్రాముఖ్యత ఉందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ మున్సిపల్ డివిజన్ల నుంచి 250 బైకుల చొప్పున కార్యకర్తలు, నాయకులు తరలిరావాలన్నారు. చిలకలగూడ నుంచి ర్యాలీగా తెలంగాణ భవన్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ కండువాలు, జెండాలు, ఇతర సామగ్రిని నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అందజేశారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి, యువనాయకులు ఆలకుంట హరి, సుంకు రామచందర్, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు బెజ్జంకి రాజేశ్, శేఖర్, సునీల్‌ముదిరాజ్, అశ్విన్, మేడిశెట్టి బాలాజీ, మురళి పాల్గొన్నారు.

సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి 3 వేల బైక్‌లతో...

మారేడుపల్లి: ఈనెల 29వ తేదీన తెలంగాణ భవన్‌లో నిర్వహించే దీక్షాదివస్‌కు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ సనత్‌నగర్ నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 29న మధ్యాహ్నం నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్‌లపై బేగంపేటలోని పాటిగడ్డలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ వద్దకు చేరుకోవాలని అన్నారు. సుమారు 3వేల బైక్‌లతో ర్యాలీగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సర్కిల్ వద్దకు రావాలన్నారు. అక్కడి నుంచి తెలంగాణ భవన్‌కు వెళ్లాలని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కొలన్ బాల్‌రెడ్డి, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, అతెల్లి శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, మల్లికార్జున్‌గౌడ్, తలసాని స్కైలాబ్ యాదవ్, శ్రీహరి, ఏసూరి మహేష్, సంతోష్, ప్రవీణ్ రెడ్డి, కర్నాకర్ రెడ్డి, ఖలీల్, లక్ష్మీపతి, శేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, నాగులు, కిషోర్, సురేష్‌గౌడ్, అఖిల్ పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన స్వేచ్ఛ నాటకం



టికెట్ విక్రయిస్తున్న రమణాచారి

రవీంద్రంభారతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనసుకు నచ్చినట్లు, ఇష్టం వచ్చినట్లు విచ్చలవిడిగా ఏదిపడితే అది చేయడం కాదు, స్వేచ్ఛ అంటే యథేచ్ఛ కాదు అనే ఇతివృత్తంగా సాగిన స్వేచ్ఛ నాటకం ఆలోచింపజేసింది. బుధవారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో స్వేచ్ఛ నాటకాన్ని ప్రదర్శించారు. విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ సమర్పించిన ఈ నాటకానికి మూలకథ పి.ఎస్.నారాయణ, నాటకీకరణ పరమాత్ముడి శివరాం, దర్శకత్వం బి.ఎం.రెడ్డి అందజేశారు. స్వేచ్ఛ ఎలా ఉండాలి ఎంత వరకు ఉండాలి అనే సారాంశాన్ని పంచారు. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ రమణాచారి నటీనటులను సత్కరించి అభినందించారు. కాసేపు టికెట్ విక్రయం కేంద్రం వద్ద కూర్చున్నారు. ఇంతలో సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ వచ్చి టికెట్ కొన్నారు. ఈ సందర్భంగా రమణాచారి టికెట్లను విక్రయించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు కళాకారులను సత్కరించి అభినందించారు.

27 రోజులుగా మృత్యువుతో పోరాడి.. తుదిశ్వాస విడిచిన చిన్నారి



జస్మిత (ఫైల్)

కుషాయిగూడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దాదాపు నెలరోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచర్లపల్లి వెంకటరెడ్డినగర్‌లో ఉంటున్న సాయికుమార్ పార్కింగ్ ప్లేస్‌లోని తన కారులో క్యాన్‌లో తెచ్చిన పెట్రోల్‌ను పోస్తుండగా కిందపడింది. ఈ నెల 1న దీపావళి పండుగకు ఇంటి ముందు వెలిగించిన దీపాలకు పెట్రోల్ అంటుకొని మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇద్దరు బాలికలు తీవ్ర ంగా గాయాలపాలయ్యారు. ఓ బాలిక యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండురోజుల తర్వాత మృతిచెందింది. ఇంట్లో అద్దెకు ఉంటున్న రాంబాబు కుమార్తె జస్మిత(4) అప్పటి నుంచి నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినది. ప్రమాదానికి కారణమైన ఇంటియజమానిని రిమాండ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ తెలిపారు.

రాజ్‌భవన్‌ను పాత నగరానికి తరలించాలి

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్‌గౌడ్



చార్మినార్ వద్ద టీడీపీ సభ్యత్వ నమోదులో అరవింద్ కుమార్‌గౌడ్ తదితరులు

చార్మినార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాతనగరానికి గవర్నర్ నివాసం రాజభవన్‌ను తరలించి, సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికలనాటికి పార్టీ బలం పుంజుకొని అధికారాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యత్వ నమోదును బుధవారం ఆయన చార్మినార్ వద్ద ప్రారంభించారు. తొలుత భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పాతనగరం అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసిందని తెలిపారు అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పాత నగర అభివృద్ధిని విస్మరించాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం పాతనగరంలో వైద్య కళాశాల ఏర్పాటు చేసి ప్రజల కోసం వెయ్యి పడకల ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని, సర్దార్ మహల్లో చార్మినార్ ఆయుర్వేద ఆస్పత్రిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం ఫోర్‌మన్ కమిటీ కో-ఆర్డినేటర్ నాగు నాగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి పి.సాయిబాబా, మాజీ కార్పొరేటర్ శంకర్ ముదిరాజ్, సమన్వయ కమిటీ ప్రతినిధులు సురేందర్, ఎండీ అన్వర్, సీనియర్ నాయకులు షమీయుద్దీన్ రఫిక్, కప్పు కృష్ణ గౌడ్, జోగేందర్‌సింగ్, నల్లా రాజ్‌కుమార్, శ్రీకాంత్, ఎంఏ రెహమాన్, అనిసుల్ రెహమాన్, వెంకట్ సాయి, వరుణ్, వెంకటరమణ, శ్రీనివాస్, సుజాత, నాగరాజు యాదవ్, సలీం, యాదయ్యగుప్తా, శైలేష్ కుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బర్కత్‌పుర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను, మెస్‌చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈర్ల ప్రసాద్, గ్రేటర్ అధ్యక్షుడు మేడి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కె.ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కల్తీ ఆహారం వల్ల విద్యార్థులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు సతీష్‌కుమార్, అనిత, మేఘన, మౌనిక, అక్షయ, రజిత తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి మషల్-2024 ఫెస్ట్

మంగళ్‌హాట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ది గార్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్(జీఐఓ) ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు మషల్-2024 ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజేషన్ ప్రతినిధులు రుజ్నా బేగం, డాక్టర్ అస్రియా ఆనం, నుహా తెలిపారు. బుధవారం ఆబిడ్స్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న ఫెస్ట్‌లు వెస్ట్రన్ కల్చర్‌ను ప్రోత్సహిస్తూ యువతను దారిమళ్లించేలా ఉన్నాయని ఆరోపించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే ఈ ఫెస్ట్‌లో మొదటి, రెండో రోజు లిటరరీ కార్నర్, ఫుడ్ ఫూషన్, ది మిస్ట్రీ వాక్, ట్యాలెంట్ ట్రెజర్, ఫన్ జోన్ పేరుతో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 1వ తేదీన ముగింపు సమావేశం ఉంటుందని తెలిపారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



గాయనీగాయకులతో త్రినాథరావు

సినీ భక్తిగీతాలు ఒత్తిడిని దూరం చేస్తాయి

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సినీ భక్తిగీతాలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని ప్రముఖ గాయకుడు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు అన్నారు. ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో భక్తిగీతాల విభావరి జరిగింది. ప్రముఖ గాయని రమణకుమారి, సహ గాయకులు విజయకుమార్, కాసీం, ప్రభాకర్, వేణుగోపాల్, కమలాకర్‌లతో కలిసి అలనాటి సినిమాలో సుశీల, ఘంటసాల పాడిన సోలో, యుగళ గీతాలు శ్రావ్యంగా గానం చేశారు. శాస్త్రీయ సంగీత గాయని స్వర్ణ మంగళంపల్లి కర్ణాటక భక్తి పాటలు ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న త్రినాథరావు మాట్లాడుతూ రమణకుమారి స్వయంగా మధుర గాయని అయిన సహ గాయకులకు వేదిక కల్పించాలన్న సదుద్దేశంతో రాగరాగిణి సంస్థను సోదరి సుబ్బలక్ష్మితో కలిసి ఆరంభించారని ప్రశంసించారు.

సుందరేశ్వర శతకం పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ తర్వాత సాహిత్యంతో సావాసం చేయడం మంచి పరిణామమని వక్తలు అన్నారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ కవుల సంఘం, కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జనువాడ రామస్వామి రచించిన సుందరేశ్వర శతకం, పద్య కవితా మురుమురాలు, ఆధునికాంధ్ర సాహిత్యంలో సంస్కరణ కవిత్వము పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, విహారి, వెల్దండ సత్యనారాయణ, నాళేశ్వరం శంకరం, సుతారం వెంకటనారాయణ, అనుమల ప్రభాకరచారి తదితరులు హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ విశ్రాంత సమయంలో సాహిత్యం పట్ల మక్కువతో పుస్తకాలను రచించడం ఆనందకరమని అన్నారు. పద్య కవిత, శతకం వంటి ప్రక్రియల్లో రచనలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ

బౌద్ధనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీలో బుధవారం అయ్యప్పస్వామి పడిపూజ కనులపండువగా సాగింది. గురుస్వాములు మోహన్‌చారి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో మాల ధరించిన స్వాములు పాల్గొని అయ్యప్పస్వామి భక్తికీర్తనలను ఆలపించారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీనివాస్‌నగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ

శ్రీనివాస్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో బుధవారం కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. మ్యాన్‌హోల్స్ పనులను పరిశీలించారు. వాటర్‌పైపులైన్ డ్యామేజ్ ఐనచోట నూతన పైపులైన్లు ఏర్పాటు చేస్తామని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ వినోద్, మేనేజర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

రెజిమెంటల్‌బజార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో మృతిచెందిన ట్రాక్ ఉమెన్ రేణుక కుటుంబానికి సొసైటీ తరుపున ఆర్థిక చేయూత అందిస్తామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయి క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ చిలుకుస్వామి తెలిపారు. సొసైటీలో షేర్ హోల్డర్ అయిన రేణుక తీసుకున్న సుమారు రూ.10లక్షల లోన్ మాఫీచేయడంతో పాటు ఇన్సూరెన్స్ ద్వారా రూ.5 లక్షలను త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. తక్షణ సహాయం కింద రూ.10 వేలను మృతురాలి కుటుంబానికి అందించినట్లు చెప్పారు.

నిర్మాణ సామగ్రి పడి కార్మికుడి మృతి

పేట్‌బషీరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భవనం వద్ద ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం, గ్రామానికి చెందిన కొల్లి తవిటినాయుడు బతుకుదెరువు కోసం దూలపల్లి గ్రామానికి వలస వచ్చాడు. అతడు గోవా కర్రలు కడుతూ జీవనం సాగిస్తున్నాడు. దూలపల్లిలోని సహస్ర ఓమ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వద్ద గోవా కర్రలను నాయుడు ఇప్పుతుండగా, ఐదు అంతస్తులో ఉన్న మరో కార్మికుడు భవన నిర్మాణ సామగ్రిని కిందికి వేయగా, అవి నాయుడు తలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూతురితో సహా తల్లి అదృశ్యం



వైశాకి దాస్, నిషితా దాస్ (ఫైల్)

రాంగోపాల్‌పేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూతురితో సహా తల్లి అదృశ్యమైంది. ఈ ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం... ఆరు నెలల క్రితం బెంగాల్ రాష్ట్రానికి చెందిన స్వరూప్ దాస్ కలాసీగూడలో వెండిపాలీష్ పనులు చేస్తూ, అక్కడే భార్య వైశాకీదాస్(25), కూతురు నిషితాదాస్(6)తో కలిసి ఉంటున్నాడు. మంగళవారం వైశాకిదాస్ కూతురుతో కలిసి సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో స్వరూప్‌దాస్ చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వైశాకి దాస్‌కు బెంగాలీ, హిందీ భాషలు మాత్రం వస్తాయని, ఆమె కానీ, నిషిత కానీ ఎవరికైనా కనిపిస్తే మహంకాళి పోలీస్‌స్టేషన్ (8712661253)లో కానీ ఇన్‌స్పెక్టర్ (8712660240)ను కానీ, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ (8712569180)లో ఎవరికైనా సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

సాయిబాబాపై ఆరోపణలు అవాస్తవం

● గోరక్ష మహదేవ్ గాడిల్కర్



మాట్లాడుతున్న గోరక్ష మహదేవ్ గాడిల్కర్, చిత్రంలో ధనుంజయ్య, గుండా మల్లయ్య తదితరులు

మన్సూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబా ఒక మతానికి చెందిన వాడని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ఇలాంటి ఆరోపణలు చేసిన వారికి తగిన బుద్ధి చెబుతామని షిరిడీ సాయిబాబా సంస్థాన్ సీఈవో గోరక్ష మహదేవ్ గాడిల్కర్ హెచ్చరించారు. షిరిడీ సాయి భక్తఐక్య వేదిక ఆధ్వర్యంలో నాగోల్‌లోని దేవకి కన్వెన్షన్‌లో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న షిరిడీ సాయిబాబా మందిరాల నిర్వాహక కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సాయినాథుడిపై కొంతమంది అసత్య ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారన్నారు. బాబా ఒకే మతానికి చెందిన వాడు కాదని మరాఠి సచరిత్రలో పేర్కొన్నారని, ఎంతోమంది రుజువు కూడా చేశారన్నారు. సాయిబాబాపై వస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న బాబా భక్తులకు ధైర్యం నింపేందుకు ఏర్పడిన షిరిడీ సాయి భక్త ఐక్యవేదిక అధ్యక్షుడు మంచికంటి ధనుంజయ్య కార్యదర్శి పీవీ సాయి, కోశాధికారి గుండా మల్లయ్య, ఇతర సభ్యులను ఆయన అభినందించారు.

భక్తుడికే సాయినాథుడి లీలలు తెలుసు

తల్లిదండ్రుల గురించి ఒక బిడ్డకు మాత్రమే ఎలా తెలుస్తుందో, సాయినాథుడిని ఆరాధించే భక్తుడికే ఆయన లీలల గురించి తెలుస్తుందని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ పేర్కొన్నారు. షిరిడీ సాయిబాబా మతంను గూర్చి బ్రిటీష్ కాలం నుంచే వచ్చిన అసత్య ప్రచారాల్లో నిజం లేదని ఆధారాలతో చూపారని, బాబా ఒక మతానికి మాత్రమే చెందిన వాడు కాదన్నారు.

అసత్య ప్రచారాన్ని తిప్పికొడదాం

రాష్ట్రంలోని షిరిడీ సాయిబాబా నిర్వహణ కమిటీ సభ్యులంతా ఒక్కటై సాయిబాబాపై అసత్య ప్రచారాన్ని తిప్పి కొడదామని ఐక్య వేదిక అధ్యక్షుడు చింతపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా సంస్థాన్ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య పేర్కొన్నారు. సమావేశం అనంతరం అతిథులను ఐక్యవేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు, సమావేశంలో ఐక్యవేదిక సభ్యులు శ్యామ్‌కుమార్, కె.సాయిబాబా, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతు, వెంకట్రాంరెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, రవీంద్రబాబు, సాయిబాబా, ప్రసాద్‌రావు, హరిప్రసాద్‌రావు, మైనంపాటి ప్రసాద్, అనిల్, సాయిశ్రీనివాస్, చంద్రకుమార్, భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.